క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని గురువారం పట్టణంలో ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, యాకూబ్, స్వప్న, భద్రూనాయక్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు వేతన చెల్లింపులెప్పుడు..?

నెల్లికుదురు, జనవరి 2 : నూతన ఉపాధ్యాయులకు వేతన చెల్లింపులు ఎప్పుడని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరి మూడునెలలు గడిపోయిందని, కనీసం సంక్రాంతి పండుగకైన వారికి వేతనాలు చెల్లిస్తారా.. లేదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి రాందాస్ చేతులమీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు నవీన్, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు భిక్షపతి, జయప్రకాశ్, స్రవంతి, అనిత, నర్సయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కొత్త నర్సింహారెడ్డి అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి రాందాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర,జిల్లా, మండల బాధ్యులు లక్ష్మణ్, సోమయ్య, రాంమోహన్‌రెడ్డి, జలగం శ్రీనివాస్, జనార్దన్, బిక్కు, హెచ్ఎంలు జీవన్‌కుమార్, ఫణీంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నమూనా ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పేదలందరికీ ఇండ్లు ఇస్తాం

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నమూనా ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గతంలో చాలామంది పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని, ప్రస్తుతం నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, ఏజెన్సీ ప్రాంతాల్లో అదనంగా మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, కౌన్సిలర్లు పోతురాజు, బుజ్జి వెంకన్న పాల్గొన్నారు.

పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను గురువారం ఎమ్మెల్యే మురళీనాయక్ పరిశీలించారు. తరగతి గదులు, ల్యాబ్‌లను, వంట శాల, డైనింగ్ హాల్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బలరాంనాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఏర్పాటు చేయాలి

ఇనుగుర్తి : ఇనుగుర్తి మండల కేంద్రంలో నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఇనుగుర్తి, కోమటిపల్లి, చిన్ననాగారం, చిన్నముప్పారంలోని 8 పీఏసీఎస్ డైరెక్టర్ స్థానాలతో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు సతీశ్ తెలిపారు.

మరమ్మతు ఎప్పుడు?

- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కొట్టుకుపోయిన ఫకీరతండా నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లేదారి

నర్సింహులపేట, జనవరి 2 : కొద్ది రోజుల క్రితం భారీవర్షాల కారణంగా మండల వ్యాప్తంగా రైతులు పంటలు నష్టపోవడంతోపాటు రోడ్డు కొట్టుకుపోయాయి. అధికారులు కొన్ని రోడ్లకు మాత్రమే మరమ్మతు చేసి, మరికొన్ని రోడ్లు మాత్రం పట్టించుకోక పోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని ఫకీరతండా నుంచి రైతుల పొలాల నుంచి ఉగ్గంపల్లి పుల్కమ్మ చెరువు, నర్సింహాపురం, బంజర గ్రామాలకు వెళ్లే దారి గత సెప్టెంబర్ మొదటి నెలలో కొట్టుకపోయింది. దీంతో సుమారు 100 ఎకరాల వ్యవసాయ పొలాల వద్దకు 60 కుటుంబాలకు వెళ్లేందుకు దారి లేక రైతులు అవస్థలు పడ్డారు. ప్రస్తుతం యాసంగి నాట్లు మొదలు కావడంతో కనీసం పొలం దుక్కి చేసుకునేందుకు ట్రాక్టర్లు వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని ఫకీరతండా రైతులు కోరుతున్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోవాలి

బేంచీలు, షూలు అందిస్తున్న భాస్కర్

కేసముద్రం, జనవరి 2 : విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో కాలేరు యాదగిరి అన్నారు. నోవెల్ ఎంటర్ ప్రైజెస్ యజమాని , మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన మాంకాల భాస్కర్ గ్రామ పాఠశాలకు రూ.80 వేల విలువైన డెస్క్, బేంచీలు, విద్యార్థులకు షూలు అందజేశారు. అలాగే ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఏర్పుల కుమారస్వామి స్టడీ మెటీరియల్, కల్వల గ్రామ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఫనికర కొమురయ్య, అనుమాండ్ల ఉప్పల్‌రెడ్డి, రావుల మురళి, యాకమల్లు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

బయ్యారం, జనవరి 2 : సీఆర్టీల (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్) సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైదని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి సీఆర్టీల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏండ్ల నుంచి చాలీచాలని వేతనాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తూ, గిరిజన విద్యార్థుల అభ్యన్నతికి సీఆర్టీలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సీఆర్టీలకు వెంటనే మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాని, మహిళా సీఆర్టీలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింజేయాలని కోరారు. ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోయిన సిఆర్టీల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ వాలూనాయక్, లాలయ్య, అంజయ్య, నాగేశ్వర్, రామయ్య, వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు రాజేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇండ్లు వేసుకున్న

పేదలకు పట్టాలు ఇవ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందం విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 2 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలు ఇచ్చి..ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్255 ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలు ఇచ్చి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీఎంను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర 255లోని 220ఎకరాల ప్రభుత్వ భూమిలో 150ఎకరాల భూమిని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాంలో కొంతమంది పేద రైతులకు అగ్రిమెంటు పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు.మిగిలిన 70ఎకరాల భూమిని రియల్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించారన్నారు. వ్యాపారుల అండతో గుడిసెలను తొలగించి.. ఆ భూమిని ఆక్రమణదారులకు అప్పగించడం కోసం గుడిసెవాసులపై 18సార్లు దాడులు చేశారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని.. గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో కేంద్రకమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, సాగర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

బానోత్ ఉమ(ఫైల్)

డోర్నకల్, జనవరి 2 : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన గొల్లచర్ల గ్రామంలో గురువారం జరిగింది. సీఐ రాజేశ్ కథనం ప్రకారం... గొల్లచర్ల గ్రామానికి చెందిన అలకంటి చంటి, అదే గ్రామానికి చెందిన బానోత్ ఉమ రెండేళ్ల క్రితం ప్రేమపెండ్లి చేసుకున్నారు. వీరికి ఏడాది పాప ఉన్నది. భార్యభర్తల నడుమ తరచూ గొడవలు జరగడంతో ఉమ తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో భర్త చంటి అత్తగారింటికి వెళ్లి ఉమ గొడవ పడి ఇంటికి వచ్చి ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో భార్య ఉమ చంటిని చూసేందుకు వైద్యశాలకు వెళ్లగా అత్త స్వప్న, మామ భద్రయ్య, ఆడపడుచు కావేరి గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన ఉమ మహబూబాబాద్‌లో ఎలుకల మందు కొని తాగి ఇంటికి కక్కుతుండగా కుటుంబ సభ్యులు గమనించి ఖమ్మం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఆమె తల్లి పద్మ ఫిర్యాదు మేరకు మామ భద్రయ్య, అత్త స్వప్న, ఆడపడుచు కావేరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.ఈ కేసును మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

పెద్దవంగర, జనవరి 2 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామానికి చెందిన యాసాని లచ్చయ్య (లక్ష్మణ్) (38) తన అత్తగారిల్లు చిన్నవంగరకు వెళ్లి, తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బావోజీతండా వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి పరశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిక్కిత పొందుతూ మరొకరు..

సతీశ్ (ఫైల్)

మరిపెడ, జనవరి 2 : మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన అనంతగిరి సతీశ్(29) చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అనంతగిరి సతీశ్ రోజూ మద్యం తాగి ఇంటి వచ్చేవాడు. దీంతో భార్యాభర్తల నడుమ గొడవలు జరిగేవి. డిసెంబర్ 31న ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురై స తీశ్ గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వై ద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. మృతుడికి కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కమిటీ

నెల్లికుదురు : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ సీఐటీయూ మండల అధ్యక్షుడిగా బొల్లం ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు మారబోయిన శ్రీను తెలిపారు. మండలంలోని స్థానిక విశ్రాంతి భవనంలో గురువారం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎల్లరి కృష్ణ, కార్యదిర్శగా వెంకన్న, కోశాధికారి సుభాన్, రాంకోటి, ప్రచారకర్తగా ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా రాము, మహిళా కో కన్వీనర్‌గా విజయ, కార్యవర్గ సభ్యులుగా రాధ, పాషా, విజయ, బాష, వెంకన్న, రఘును ఎన్నుకున్నట్లు తెలిపారు.



తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ నూతన మండల కమిటీ

హమాలీ రేట్ల జీవో అమలు చేయాలి

మరిపెడ, జనవరి 2 : సివిల్ సప్లయ్ గోదాముల్లో హమాలీ రేట్ల జీవోను విడుదల చేసి సంవత్సరం కావొస్తున్నదని, వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన నిరవధిక సమ్మె చేస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్‌కు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్లను తప్పనిసరి పెంచాలనే జీవో ఉన్నదన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెట్టడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అబ్దుల్ రషీద్, తురక రమేశ్, ఎల్లుట్ల నారాయణ యాకన్న, అంజి వెంకన్న, రమేశ్, వెంకన్న, కార్తీక్, వెంకటేశ్, హనుమంతు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ

కిందపడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మరిపెడ, జనవరి 2 : వ్యవసాయ బావుల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి కాపర్‌వైర్ చోరీ చేసిన ఘటన మండలంలోని తండధర్మరం శివారులో బుధవారం జరిగింది. రైతు గుగులోత్ రాజేందర్ కథనం ప్రకారం.. రాజేందర్ గురువారం ఉదయం తన మామిడి తోట వద్దకు వెళ్తూ, తోటలో ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడి ఉండడాన్ని గమనించి వెళ్లి చూడగా, అందులో కాపర్‌వైర్ కనిపించ లేదు. కాపర్ వైర్ చోరీకి గురైనట్లు గుర్తించి, చుట్టు పక్కల రైతులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రాజేందర్ తెలిపారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం చేస్తాం

సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతుగా మాట్లాడుతున్న శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం చేస్తామని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహాంకాళి వీరన్న అన్నారు. గురువారం ఆయన ఎమ్మార్వో సెంటర్‌లో సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మూల స్తంభాలు అని, అనేక సంవత్సరాలుగా విద్యకు సేవ చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి వారి కుటుంబాల్లో వెలుగు నింపాలన్నారు. ఈ ధర్నాకు టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, ప్రభాకర్, బాబురావు, గణేష్, సాగర్, కల్పన పాల్గొన్నారు.

నల్లబెల్లం అమ్ముతున్న ఏడుగురిపై కేసు

నర్సింహులపేట, జనవరి 2: నల్లబెల్లం అమ్ముతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. గురువారంస్థానికంగా ఆయన మాట్లాడుతూ.. రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హున్యతండాలోని జాటోత్ నరేశ్ ఇంట్లో 2 క్వింటాళ్ల నల్లబెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సురేశ్‌తోపాటు అతడి దగ్గర బెల్లం కొనుగోలు చేసిన మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మానసిక స్థైర్యం పెంచుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : విద్యార్థులు మానసిక స్థైర్యం పెంచుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అన్నారు. గురువారం ఆయన కళాశాలలో టెలీ మానస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించి దృఢమైన వ్యక్తిత్వం కలిగించేలా శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికిరణ్, శ్రీనివాస్, రియాజ్, నవీన్‌కుమార్, భార్గవి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కురవి : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ రవి, ఎంపీవో ఎండీ గౌస్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని సంత ఆవరణలో సీఎస్‌సీ నిధులు రూ.3లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తులు, సంతకు వచ్చే వ్యాపారులకు మరుగుదొడ్లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు.కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో యా కాంబ్రం, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, టీఏ రవి పాల్గొన్నారు.

మొగిలయ్యగౌడ్‌కు నివాళి

మహబూబాబాద్ రూరల్ : నిజాం నిరంకుత్వానికి వ్యతిరేకంగా బహుజనవీరుడు బత్తిని మొగిలయ్య గౌడ్ విరోచితంగా పోరాటం చేశారని గౌడ జన హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, వెంకన్న వీరేందర్ పాల్గొన్నారు.

గ్రామాన్ని రెండుగా విభజించొద్దు

నర్సింహులపేట, జనవరి 2: తమ గ్రామ పంచాయతీ పరిధిలో ఆరు తండాల ప్రజలతో ఎలాంటి గ్రామ సభలు నిర్వహించకుండా తమ గ్రామాన్ని విడగొట్టొద్దని బీఆర్ఎస్ నాయకుడు బాదావత్ కిషన్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని బోడ్కతండాలో ఆయన మాట్లాడుతూ.. బోడ్కతండా, గోల్‌తండా, చర్లతండా, ధన్‌సింగ్‌తండా, దూప్యతండా, పుసలితండా ప్రజలకు తెలియకుండా తీర్మానం ఇవ్వడం సరికాదన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో, కలెక్టర్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వీరు, వెంకన్న, శంకర్, వీరన్న, కిషన్, దస్రు, నరేశ్, సుక్య, రామచంద్రు, రమేశ్, కోటేశ్, బధ్య పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్నం భోజనం

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం అందిస్తామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేశ్ అన్నారు. గురువారం ఆయన కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దాతల సహకారంతో 45రోజుల పాటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తామని, ప్రతి ఒక్కరూ ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షాహిద్, సుశీల, నాగిరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం డీఈవో ఆఫీస్‌లో ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో కలిసి సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షల సమయంలో తప్పని సరిగా పాఠశాలకు హాజరల్యా వారి తల్లిదండ్రులతో మీటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఉత్తీర్ణ శాతాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్లు, టీచర్లు పాల్గొన్నారు.

హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : పొనుగోడు హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కేసముద్రం బేరువాడకు చెందిన గణేశ్‌ను హాస్పిటల్‌కు తీసుకొస్తే వైద్యులు నిర్లక్ష్యం చేయడంతో అతడి పూర్తిగా దెబ్బతిన్నదని, వెంటనే దవాఖాన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌నాయక్, చందూలాల్, రవి, నరేశ్ పాల్గొన్నారు.

ట్రెసా ఆధ్వర్యంలో రూ.20వేలు అందజేత

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : కలెక్టరేట్‌లో గురువారం జిల్లా ట్రెసా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు రూ.20 వేల నగదును అందజేశారు. సీఎం కప్ ప్రాతినిధ్యం వహించే క్రీడ కారులకు షూ, ఇతర సామగ్రి కోసం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పవన్, ఎమ్మార్వో భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

4న విగ్రహాల ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్, జనవరి 2 : ఈ నెల 4న పట్టణంలో వివేకానంద, కుమ్రంభీం విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్ పాల్గొంటారని తెలిపారు.

ఆకతాయిలపై ప్రత్యేక నిఘా

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం తెలిపారు. కళాశాలలు, పాఠశాలలో విద్యార్థులకు షీ టీంల ద్వారా అవగాహన కల్పించి, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. గుంపుగా ఉన్న ప్రదేశాల్లో పోలీసులు మఫ్టీలో ఉండి కట్టడి చేస్తామని ఎస్పీ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం

డోర్నకల్:గన్యాతండాకు చెందిన మాలోత్ పద్మకు గురువారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. అందులో డోర్నకల్ పీహెచ్‌సీకి తరలిస్తుండ గా నొప్పులు ఎక్కువ కావడంతో మున్నేరు వాగు వద్ద ఈఎన్‌టీ షమీ మ్ ప్రసవం చేశారు. తల్లీబిడ్డను ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

సీపీఐ(ఎంఎల్)కు వెంకటేశ్వర్లు రాజీనామా

చిన్నగూడూరు : సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్–ప్రజాపంథా పార్టీకి, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చందుకు అభినందనలు

చిన్నగూడూరు, జనవరి 2 : మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి విద్యార్థి పులిచంద్ ఇటీవల సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. గురువారం మండల కేంద్రంలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో చందును శాలువాతో సన్మానించి పలువురు అభినందనలు తెలిప